

సాయంత్రం అయిదు దాటుతోంది. అప్పుడే కాలేజీ నుండి వచ్చిన నేను చీర మార్చుకుని జుట్టు చిక్కు తీసుకుంటూ డాబామీద కూర్చున్నాను. తలంటి పోసుకోవడంవల్ల ఒక్కుమ్మడిగా జీవితం పైకి విరుచుకుబడిచిక్కగా అల్లుకుపోయే కష్టాల్లాజుట్టంతా చిక్కుపడిపోయింది, నెమ్మదిగా వేళ్ళతో ఆ చిక్కులను విడదీస్తున్న నాకు హటాత్తుగా వసంత జ్ఞాపకమొచ్చింది.

హుం! వసంత!! - వసంత జ్ఞాపకమొస్తే తను వెంట తీసుకు వచ్చే ప్రమాదపు భయంకూడా జ్ఞాపకం వస్తుంది. సాయంత్రం ఒకసారి ఇంటికి రమ్మని నిన్నే చెప్పింది - వెళ్ళాలి. - వెళ్ళక తప్పదు నేను తప్పించుకోవాలనుకుంటున్నా తప్పించుకోలేని బంధం అది. వసంతతో పరిచయం జరిగిన తీరు ఇప్పటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటుంది. ఆరోజు

కాలేజీ వార్షికోత్సవం జరుగుతోంది ఎప్పటిలా నాపాట ప్రోగ్రాం కూడా ఉంది. వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఆరోజు పాడబోతున్న పాటలు రిహార్సిల్ వేసుకుంటున్నాను. ఇంతలో ఒక అమ్మాయి గదిలోకి వచ్చింది. గులాబీరంగు చీర, జాకెట్, రెండు జడలు, ఒక జడలో గులాబీ పువ్వు. కుడిచేతికి గులాబీరంగు గాజులు రెండో చేతికి అదే రంగు బెల్టుతోవాచి,నడుస్తున్న గులాబీపువ్వులా ఉంది తిన్నగా నా దగ్గరకు వచ్చి "నమస్తే!"అంది-నేను కొద్దిగాఆశ్చర్య పడానుఅంతలోనే తేరుకొని ప్రతి నమస్కారం చేశాను.

మీగురించి చాలాసార్లు విన్నాను - ముఖ్యంగా మీరుపాడే "ప్రియె చారుశీలే" అష్టపదిని గురించి మా ఫ్రెండ్స్ చాలామంది చెప్పారు. క్రిందటిసారి మ్యూజికల్ నైట్‌లో మీరు పాడుతుండగ విన్నాను. వాళ్ళుచెప్పిన దాంట్లో అతిశయోక్తి లేదనిపించింది. మీ గొంతులో భావం, ఆకర్షణ, ఆవేశం కలిసి ఉన్నాయి. ఆ అష్టపది ఈరోజు కూడా పాడుతున్నారా?

సాధారణంగా మీరు ప్రతి ప్రోగ్రాం లోనూ దాన్ని తప్పకుండా పాడతారని విన్నాను. నిజమేనా? ఈ రోజు పాడుతున్నారా? లేకపోతే దయచేసి నా కోసమయినా పాడండి- ఇంకోసారి వినాలని ఉంది" అంటూ ఆ అమ్మాయి ఆగకుండా మాట్లాడేస్తుంటే నాకు నవ్వు వచ్చింది. నవ్వుతూనే, "అలాగే పాడతాను లెండి- ఇంతకూ మీరు...." అని అర్ధోక్తిలో ఆగిపోయాను.

"ఐయాంసారీ- నేనెవరో చెప్పలేదు కదూ! విమెన్స్ కాలేజీలో చదువుతున్నాను. పేరు వసంత."

పేరు వింటూనే ఉలిక్కి పడాను-వసంత!

నావ-సం-త!

నాలో ఉద్వేగం కట్టలు తెంచుకుని ప్రవహించి కట్టలు అప్రయత్నంగా ఆమె చెయ్యి పుచ్చుకుని ప్రక్క నే కూర్చో బెట్టుకున్నాను.

"ఇక చెప్పండి-ఏం చదువుతున్నారు - మిమ్మల్నెప్పుడూ చూడలేదు నేను-" అన్నాను.

"బి. ఎ. ఫైనల్‌లో ఉన్నాను. మీకు నేను తెలిసే అవకాశం లేదులెండి. నలుగురూ గుర్తించే ప్రత్యేకత లేమీ నాకు లేవు. మామూలు స్టూడెంట్‌ని - అంతే! మీరు బాగా పాడతారు కనుక అన్ని కాలేజీలలోనూ మీ గురించి తెలుసు - మీతో స్నేహం చేయాలని సరదాగా వుంది."

"మీరు తమాషాగా మాట్లాడుతున్నారు. పరిచయం భాగ్యంగా అనుకోవాల్సినంత గొప్పదాన్ని కాదు. అయినా నా స్నేహం కోరి వచ్చిన మిమ్మల్ని చూస్తే గర్వంగా వుంది."

"అయితే నన్ను మీ స్నేహితురా లిగా స్వీకరిస్తున్నట్టేనా ?"

నాటకీయంగా అడిగిన ఆ ధోరణికి నవ్వు వచ్చింది. "తప్పకుండా – అదే ప్రశ్న నేనే మిమ్మల్ని అడగాలనుకుం టున్నాను. మీ కలుపుగోరుతనం ఎవ్వరి నైనా ఆకట్టివేస్తుంది."

"అయితే ముందా 'మీరు' తీసివేయండి – సారీ – తీసివేయి."

"ఊఁ ! ఇంకా ?"–

"ఇంకా–ఇంకా – రేపు సాయంత్రం మా ఇంటికి రావాలి."

తరువాత నేను రిహార్సల్స్‌లో మునిగి పోయాను. పాడుతున్నంత సేపు వసంత నావేపే చూస్తూ కూర్చుంది. పాడు తున్నానే కాని మనసు నా వసంత వేపు పరుగులు తీస్తోంది. ఒకప్పుడు వసం తతో పరిచయం ఇలాగే హఠాత్తుగా జరి గింది. అప్పట్లో నేను కాలిలో పి.యు.సి. చదువుతుండేదాన్ని. ఒక రోజు కాలేజీ వెయిటింగ్ రూంలో కూర్చుని ఉన్నాను. గదిలో ఇంకెవ్వరూ లేరు. కళ్ళుమూసుకుని సన్నగా ఏదో పాడుకుంటున్న నాకు కళ్ళు తెరిచేసరికి ఎదురుకుర్చీలో గెడ్డం క్రింద చెయ్యి పెట్టుకుని నావేపే ఆసక్తితో చూస్తున్న ఒక అమ్మాయి కనిపించింది. నేను తన వేపు చూడగానే.

"ఆపేశారేం ? పాడండి. మీరు చాలా చక్కగా పాడతారే–" అంది.

నేను తెల్లబోయాను.

"పోనీలెండి – ఇంకొకసారి పాడు దురుగాని. బలవంతంగా పాడించిన పాటలో జీవం ఉండదు. సంగీతం నేర్చు కుంటున్నారా ?"

"అవునండి"

"మీపేరు – ?"

'సుధ – మీపేరు ?'

'వసంత – ఏం చదువుతున్నారు ?'

'పి. యు. సి. – మీరు ?'

'బి. ఏ. మొదటి సంవత్సరం.

అలా మొదలయిన మా పరిచయం త్వరలోనే విడదీయలేని గాఢ స్నేహంగా మారిపోయింది. మా ఇద్దరి ఆలోచనలూ అభిరుచులూ, ఆశయాలూ, ఒక పంథాలో ఉండడమే అందుకు కారణం అయిఉండవచ్చు. మొదటినుండి ఏకాంత ప్రియనయిన నేను వసంత స్నేహంతో క్లాసుమేట్స్‌ను కూడా అంతగా పట్టించు కునేదాన్ని కాదు.

నాలాగే వసంతకు కూడా పాటలంటే ప్రాణం. రాధాకృష్ణులపరంగా ఏం పాడినా పరవశించి పోతుండేది. ముఖ్యంగా "ప్రియే చారుశీలే" అనేది వసంత ఎక్కువగా అభిమానించే అష్ట పది. తంబుర మీటుతూ నే నది పాడు తుంటే భావోద్వేగంతో అప్పుడప్పుడూ ఆ కళ్లలో నీళ్లు తిరగడాన్ని కూడా నేను గమనిస్తుండేదానిని. వసంత ఆ పరవ శత్వాన్ని చూస్తే నా పాట సార్థకమైన




ట్లనిపించి మనసంతా ఏదో తెలియని తృప్తితో, అనుభూతితో నిండినట్లయేది. నా వసును ఎదురుగా నిలిపే అష్టపది ఆమెకు అంకితంగా నా ప్రతి ప్రోగ్రాం లోనూ పాడటం నాకు అలవాటయి పోయింది. ఆ అష్టపది నాకు చాలా ఇష్టం అని ఇక్కడి స్టూడెంట్లకి కూడా తెలిసి పోయింది. నా ఆలోచనలతోను, ఊహల తోనూ నాకు తెలియకుండానే పెనవేసుకు పోయిన వసంతకు దూరంగా హైదరా బాద్ వచ్చాక కాని తెలియలేదు. నాపైన ఆమె ప్రభావం ఎంత గాఢంగా ఉందో, వసంత ప్రభావం కాదది – వ్యక్తిత్వం

వికసించే తొలిరోజుల్లో ఆలోచనల్నీ, భావాల్నీ పదునుపెట్టి జీవనవిధానం పట్ల నిశితమైన అభిప్రాయాలనీ, వాటిని ఆచరణలో పెట్టడంలో ధృఢ త్వాన్ని అలవరచుకోవడానికి ప్రతి మనిషికీ శిక్షణ అవసరం. వసంత స్నేహం ఆ శిక్షణ నిచ్చింది. వసంతతో స్నేహం నాకు తెలియకుండానే నా ఆలో చనా పద్ధతుల్ని అతిస్పష్టంగా పెంచింది. "ఇలా చెయ్యి" అని వసంత ఎప్పుడూ నాతో అనలేదు కాని తనుచేసే ప్రతి పనిలోనూ కనిపించే ఆత్మవిశ్వాసం నన్ను ఒక్కొక్కసారి చకితను చేస్తుం

దేది. బహుశః నాకంటే వయస్సులో పెద్దదయిన ఆమెతో స్నేహాన్ని నా మనస్సు నాకు తెలియకుండానే శిక్షణగా స్వీకరించి ఉండవచ్చును. ఏమయినా వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవడంలో వసంత ప్రభావం నాపైన చాలానే ఉంది.

జీవితంలో ఔన్నత్యానికీ మమతకూ నిర్వచనాలు నేర్పి స్నేహపు విలువల్ని తెలియ చెప్పిన వసంతకు దూరం అవడంతో నా మనసు ఒడ్డునపడ్డ చేపలా అయింది. వసంతలేని శూన్యాన్ని భరించలేక, ఇక్కడ పరిచయాలు పెంచుకోవాలని ఏకాంతంలో వసంత ఆలోచనలతో వేగిపోయే మనసు తహతహలాడేది. కాని అందరూ కేవలం క్లాస్‌మేట్స్‌గా పరిచయస్తులుగా మాత్రమే మిగిలిపోయారు. నలుగురినీ ఆకర్షించిన నాపాట చాలామంది నాతో స్నేహం చేసుకోవాలని ప్రయత్నించేటట్లుచేసింది. కాని ఎవరూ వసంతలా దగ్గరగా రాలేకపోయారు. సంగీతం వయిపు కూడా మనసు పోయేదికాదు

నాయీ తపనని ఉత్తరాల్లోచూస్తున్న వసంత ఒకసారి వ్రాసింది. "సుధా ! మనిషి ఎదురుగా ఉన్నప్పుడేకాదు. పరోక్షంలో గూడా వారి అభిరుచుల్ని మన్నిస్తే ఆ వ్యక్తి దగ్గరలేని లోటు అంతగా బాధించదు ఆ వ్యక్తికి విలువైన విలువ ఇవ్వటం అంటే నా దృష్టిలో అదే" అని. ఆ మాట మేరకు నేను పాడటం మానలేదు. అయినా పాటకూ వసంతకూ భేదం తెలియదు నాకు. వసంత పేరు వెనుకనున్న ఈ ఆత్మీయతా భావమే నన్ను ఈ క్రొత్త వసంత వేపు ఆకర్షించింది.

ఆలోచనల్లోపడి పాడిన చరణాన్నే పాడుతున్న నన్ను చూసి వసంత ఫక్కున నవ్వింది. నేను ప్రకృతంలోకి వచ్చాను.

కాలేజీ వార్షికోత్సవంతో మొదలయిన మా స్నేహం క్రమంగా మొగ్గలు తొడగసాగింది. వసంత అభిప్రాయాలు నాతో అంతగా కలవకపోయినా నేనే సర్దుకుపోయేదాన్ని. ఎందుకనో వసంతను దూరం చేయాలనిపించదు. అందుకు కారణం ఆమె పేరు పరిచయమైన తీరు నా వసంతను గుర్తుచేయడమే. నేను జయించలేకపోతున్న ఈ బలహీనతే, ఈ వసంతకు నా పట్ల ఉన్నది అభిమానం కంటే అసూయ అని తెలుస్తున్నా స్నేహం చేసేటట్లు చేస్తోంది.

వసంత స్నేహంతో గడిచిపోతున్న రోజులు సంతృప్తికరంగా ఉన్నాయనే కంటే నిర్లిప్తంగాదొర్లిపోతున్నాయంటే బాగుంటుంది, ఇదివరకు మనసుకేదైనా కష్టం కలిగినప్పుడు సాయంత్రాలు ఒక్కర్తెనూ కూర్చుని ఆకాశంలోకి చూస్తున్నప్పుడు భరించలేని

ఆనందం కలిగినప్పుడు, మనసు విప్పి మాట్లాడాలని పించినప్పుడు వసంత జ్ఞాపకం వచ్చేది. ఇప్పుడు కూడా వసంతే జ్ఞాపకం వస్తోంది. అకారణంగానే ఈ వసంతపై చిరాకు కలుగుతుంది. నా కోసం, నాతో స్నేహం కోసం తన కోరికలనీ, ఆశయాలనీ మరుగుపరిచే ఈ వసంత చేస్తున్న తప్పు ఏమిటో నా కర్థంకావడంలేదు. బహుశః ఈమె ఈ ప్రవర్తనే నా కీమె పట్ల క్రమంగా నిరసన భావాన్ని కలుగ జేస్తోందేమో! నా ఉద్దేశ్యంలో స్నేహం అనేది భావాలు కలబోసుకుని ఇద్దరి వ్యక్తిత్వాలని వికసింప జేసేదిగా ఉండాలని వసంత జ్ఞాపకాలనుండి కొంత సేద దీరడంకోసం క్రొత్త పరిచయాలకోసం ఎదురుచూసిన మనసు ఈ వసంతను ఎంతో ఆనందంతో స్వీకరించింది. కాని ఆ ఆనందం నిలబడకుండా ఏజ్ఞాపకాల నుండి పారిపోవాలనుకున్నానో ఆజ్ఞాపకాల దగ్గరికేనన్ను ఈమెస్నేహం మరీరిమరీతరమడానికి కారణమేమిటి ?

అంతకంతకూ నామనసులో అశాంతి పేరుకు పోసాగింది. నాయీ అశాంతిని ఉత్తరాల్లో చదువుతున్న వసంత ఒకసారి వ్రాసింది "సుధా! ఒకప్పుడు నన్ను విపరీతంగా ఆకర్షించిన నీ ఈ సున్నితమైన మనస్తత్వం అనుభవాలతో గట్టి పడుతుందను కున్నాను. కాని ఇలా నీ పాటలాగే దానిమ్మ పూవులా ఉండిపోతుందను కోలేదు. మన పరిచయస్తులను ఒకరిని మరొకరితో పోల్చడానికి ప్రయత్నిస్తే జీవితంలో మిగిలేవి అశాంతి, అశాభంగం మాత్రమే! అయినా విరజాజి వంటి నీ పాట మనసు. వాటి చుట్టూ వింత ఆకర్షణ ఉండటం సహజమేమరి.

కాని మల్లెనుచూసి గులాబీ అనుకుని ముళ్ళున్నాయని భ్రమపడుతున్నావేమో! అయినా అకారణంగా నీ మనసు ఎవరినీ ద్వేషించదని నా నమ్మకం. బహుశః కాలమే నాయీ సందేహానికి సమాధానం చెపుతుందేమో? సంగీతమే గాలి నీరుగా పెరిగిన వారి మనసు చిరుగాలికి వణికే పూరెమ్మలా మృదువుగా సుకుమారంగా ఉంటుందని ఎక్కడో చదివాను నేను. నీలో చూస్తున్నాను సుధా! నువ్వు మరీ యింత సుధవేం??"—

నావసు ఉత్తరాలు ఇలా ఊరడింపు దోరణిలో సాగిపోతుంటాయి.

ప్రతిరోజూ సాయంత్రం తిరిగి చైతన్యాన్ని చీకట్లు ఆక్రమించుకునే సంధ్యవేళ నేను సంగీతసాధనపూర్తిచేసి తంబురా క్రింద పెట్టడం వసంత మేడమెట్లు ఎక్కడం ఒక్కసారే జరుగుతాయి. గుమ్మంలో నిలబడ వసంతను చూడగానే నా మనస్సు గతంలోని నా వసంత దగ్గరికి జారిపోతుంది. ఆ రోజుల్లో వసంత నేను పాడుకునే సమయానికి తప్పనిసరిగా వచ్చేది. ఏకార్య

క్రమమయినా మారేదికాని మాయీ దిన చర్యలో మాత్రం మార్పుండేది కాదు. తంబురా శ్రుతిచేసి ఆరోహణలో ఆగి గుమ్మంలో నిలబడ్డ వసంతను చిరునవ్వుతో పలుకరించి అవరోహణ పూర్తి చేసేదాన్ని. ఆ సమయంలో మా ఇద్దరి మధ్యా సాధారణంగా మాటలు ఉండేవి కావు. తలవంచుకుని నేను నా సాధనలో మునిగి పోయేదాన్ని తను లిటరేచరు స్టూడెంట్ కనుక సాహిత్యానికి సంబంధించిన నోట్స్ ఏదైనా వ్రాసుకుంటుండేది. ఒకసారి నేనడిగాను "సాయంత్రాలు లిటరేచరు నోట్సు మాత్రమే వ్రాస్తుంటావా?" అని. వ్రాస్తున్నది, ఆపి, పెన్ను మూసేసి వచ్చి ప్రక్కగా నా ఒళ్ళో తలపెట్టుకుని పడుకుంటూ, "మంచిపాట, మంచి సాహిత్యం- ఈ రెండింటిలో ఏ ఒక్కటైనా చాలు మనసుని సంతృప్తితో నింపివేయడానికి. ఇక్కడి తమాషా ఏమిటో చెప్పనా? నా ఒక్కర్తెకే ఈ రెంటినీ కలిపి ఆస్వాదించే అదృష్టం కలగడం. ఊఁ ఊఁ-కబురుకాదు. కాస్సేపుపాడు" అంది. అని అలానే కళ్ళు మూసుకుని నా ఒళ్లో పడుకుంది. ఆరోజు "ప్రియే చారుశీలే" అష్టపది పాడుతుంటే నా కళ్ళలో నీళ్ళు నిండాయి.

వసంత వైపు పరిగెట్టే ఆలోచనల్ని మరల్చుకుంటూ తంబురా ప్రక్కన పెట్టి ఈ వసంతను ఆహ్వానిస్తుంటాను. బుట్టెడు కబుర్లతో వస్తుంది వసంత. వాటిని నాదగ్గిర బోర్లించి వెడుతుంది. అవన్నీ సాధారణంగా వాళ్ళ కాలేజీలో జరిగిన అమ్మాయిల కథలతో నిండి ఉంటాయి. వాటిని గురించి చెబుతున్నంత సేపూ నేను కేవలం శ్రోతగా మాత్రమే మిగిలిపోవలసి వస్తుంది. కాని వసంత చెప్పడం కోసమే అక్కడ ప్రతిరోజూ ఒక కథ జరుగుతుందా అనే సందేహం మాత్రం ఎంత అణచివేస్తున్నా మనసులో ఏ మూలనుంచో తలయెత్తుతుంటుంది.

ఆలోచనల్లోంచి తేరుకుంటూ "రా- అక్కడే నిలబడి పోయావేం?" అన్నాను. వసంత మాట్లాడలేదు - కిటికీలోంచి దృష్టి మరల్చనూ లేదు. ఆమె అంతగా ఆకర్షించిందేమిటోననే కుతూహలంతో నేనూ వెళ్ళి చూశాను. అప్పుడే వీధి మలుపు తిరుగుతున్న లలిత తప్ప ఎవరూ కనిపించలేదు.

"ఏమయింది?" అనడిగాను.

"ఆ వెళుతున్న దెవరో తెలుసా?" లలిత వెళ్ళినవేపే చూస్తూ అంది.

"లలిత కదూ"

"అవును."

"ఏమయింది?"

"ఏమయిందేమిటి? ఈ మధ్య లలిత ఓ పెద్ద హీరోయిన్ అయిపోయింది తెలుసా? సంగీతం తప్ప

ప్రపంచంలో ఇంకేవీ ఆకర్షణీయంగా కనిపించవు నీకు."

వసంతలో నా వసంత కనిపించినట్లయి మనసు చివుక్కుమంది నాకు.

"ఏమయిందో చెప్పకుండా ఇప్పుడా సంగతెందుకు?" - నా గొంతు నాకే కటువుగా వినిపించింది.

"లలిత ఎవరితోనో కలిసి సినిమాకు వచ్చింది."

"ఎవరయినా బంధువులేమో!"

"ఆ మాత్రం నాకూ అనిపించక పోలేదులే." ఈసడింపుగా అంది. "అతను వాళ్ళ క్లాస్‌మేట్ ఆనందరావు. ఈమధ్య ఇద్దరిమధ్య పెద్ద గ్రంథమే జరుగుతోంది. పోనీ చివరికి ఫలిస్తుందా అంటే అదీ చెప్పలేం - అతను కమ్మ- ఈవిడ బ్రాహ్మిణ్ - అందులోనూ వాళ్ళింట్లో అసలే ఛాదస్తం ఎక్కువట.

"అటువంటి పట్టింపులు ఇప్పుడంతగా ఉన్నాయనుకోను."

"అవుననుకో-అయినా వాడు తిన్నగా పెళ్ళిచేసుకుంటాడని నమ్మకమేమిటి? లక్షణంగా కాలేజీకి వెళ్ళి చదువుకుని బాగుపడమంటే లలితకిదేం బుద్ధి? ఇవన్నీ చూస్తుంటే యిటువంటి వాళ్ళు ఆ కాలేజికి వెళ్ళేకంటే అసలు చదువు మానేయడం ఉత్తమం అనిపిస్తోంది. ఇలాంటి 'రకాలు' చేరడంవల్లే కాలేజీలకి, ఆడపిల్లలకి అంత చెడ్డ పేరు వస్తోంది. వ్యక్తుల తరహా యిది అని స్పష్టంగా తెలిసినప్పుడు వాళ్ళతో కలిసి తిరగడమన్నా, చదవడమన్నా ఎంత అసహ్యమో తెలుసా? సాధ్యమయినంత వరకూ వాళ్ళకు దూరంగా ఉండాలి. లేకపోతే వాళ్ళు దిగిన గోతిలోకే ఎప్పుడో మనల్ని దింపేయగలరు..."

ఇలా సాగిపోయింది ఆ రోజు వసంత ధోరణి. అటువంటి సందర్భాల్లో శ్రోతగా మిగిలిపోవడం తప్ప నేనేమీ చేయలేకపోయేదాన్ని.

వసంత స్నేహం రానురాను సమస్యగానే తయారవుతోంది. పేర్లలో సామ్యం, భావాలలో వైరుధ్యంతో ఎక్కడో దూరంగా ఉన్న నా వసంతను అహర్నిశలూ జ్ఞాపకం చేసే ఈ స్నేహాన్ని కాదనలేని బలహీనత ఏదో మంచులా నా మనసును కమ్ముకునే ఉంది. మూడవమనిషిని గురించిన ఆసక్తిని ద్వేషించే నా వసంత స్వభావమే నాదీ కావడంవల్ల సదా అన్యాసక్తంగా ఉండే ఈమె ధోరణి క్రమంగా నాలో ఈమెపట్ల కఠినత్వాన్ని పెంచుతోంది. అయినా నా వసంతవ్యక్తిత్వపువిలువను అనుక్షణం గుర్తు చేసే ఈ బంధాన్ని త్రెంచుకోలేను. ఒక విధంగా ఈమె స్నేహాన్ని మిస్‌యూజ్ చేస్తున్నానని బాధ కలుగుతోంది. ఒక వ్యక్తితో పరిచయం కేవలం వేరొక వ్యక్తి సాన్నిధ్యాన్ని జ్ఞాపకం చేసుకోవడం కోసమే అనేది హేయమైన విషయం.

నన్ను నేను మోసం చేసుకోవడమే కాకుండా వసంతను, అసలు స్నేహం అనే పదాన్ని కూడా మోసం చేయడమే. అయినా ఈ స్నేహాన్ని వదులుకోలేను ? ఎలా ? ఎలా ఈ స్వార్థాన్ని జయించడం ?

పాడుతున్నానే కాని ఆ రోజు నా మనసు పాటలో లీనం కా నే లే దు. ప్రాక్టిస్ దారి ప్రాక్టిస్‌దీ ఆలోచనల దారి ఆలోచనలదీ అయింది. గదిలో కొచ్చిన తమ్ముడు అడిగాడు ఈ రోజు వసంత రాలేదేమని. నాకు నవ్వు వచ్చింది, వసంతను గురించి ఆలోచిస్తూ ఆమె రా క పో వ డా న్నే గు ర్తించలేదు నేను. రెండు రోజులు గడిచాయి-వసంత రాలేదు.

నాలుగోరోజు కాలేజీనుండి వస్తూ నేనే వాళ్ళింటికి వెళ్ళాను. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. నెమ్మదిగా త్రోసి లోపలకు అడుగుబెట్టాను.ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. వ సం త కు ఏ జ్వరమో వచ్చివుంటుంది. లేకపోతే ఇంత స్తబ్ధవాతావరణం వుండదు. లోపలి గదిలో వసంత నాన్నగారు కూర్చుని ఉన్నారు. నన్నుచూసి లోపలకు వెళ్ళమన్నట్లుగా సైగచేసారు. తి న్న గా వంటింటిలోకి వెళ్ళబోయాను. గుమ్మంలోనే ఎదురొచ్చిన వసంత వదిన నా చేయి పట్టుకుని ప్రక్క గదిలోకి తీసుకువెళ్ళి కూ ర్చో బె ట్టి తానూ కూర్చుని యేదో పుస్తకం తిరగవేయ సాగింది. నాకేమీ అర్థంకాలేదు.

"వ సం త రావడం లేదేం ?-" అన్నాను - సంభాషణ ఎలా మొదలు పెట్టాలో తెలియక ఆవిడ గంభీరంగా నా కళ్ళలోకి చూసి "వసంత ఇకరాదు" అంది.

ఉలిక్కి పడ్డాను.

"మీ ఇంటికే కాదు ఎవరింటికిరాదు"

ఈ హటాత్పరిణామానికి కారణం అర్థం కాలేదు. అంతలోనే ఒక ఊహ వచ్చింది. నెమ్మదిగా నవ్వుతూ.

"పెళ్ళి సంబంధం ఏదయినా కుదిరిందా ?" అన్నాను.


"వసంత లేచిపోయింది !"

నా చేతిలోని పుస్తకాలు జారిపోయాయి. అయోమయంగా అ లా గే ఆవిడవేపు చూస్తుండిపోయాను.

"చెప్పింది అర్థం కాలేదా ? వసంత లేచిపోయింది." - మాట వచ్చింది నా వెనకాల నుంచని అప్పటికి తెలిసింది. చటుక్కున వెనక్కి తిరిగాను.

గు మ్మం రెండువేపులనీ చేతులతో పట్టుకుని వసంత తల్లి నిలబడి ఉంది. మనిషి జబ్బుపడిన దానిలా ఉంది. కళ్ళు పిచ్చిగా ఎటో చూస్తున్నాయి.

"అ త్తయ్యా ! మీరెందుకువచ్చారు? అంటూనే వెళ్ళి ఆవిడను పొదివి పట్టుకుంది వసంత ఒదిన. ఆవిడను లోపలకు తీసుకువెళ్ళి తిరిగివచ్చేవరకూ నే




వలా నిలబడేఉన్నాను. నా భుజం మీద చెయ్యివేసి కూర్చోబెడుతూ,

"వసంతకు మేం ఏం లోటుచేశాం నువ్వు చెప్పు?" అంది. ఆవిడ గొంతు బొంగురుపోయింది.

"అసలేమయిందండీ?" ఈ ప్రశ్న వేయకుండా ఉండటం ఎలాగో నాకర్థం కాలేదు.

"ఈమధ్య అదోలా ఉంటోంది. మేం అడిగితే నవ్వి ఊరుకునేది. మొన్నఆదివారం ప్రొద్దుటే ప్రైవేట్‌క్లాస్ ఉందంటూ వెళ్ళింది. సాయంత్రం అయినా రాలేదు. వాళ్ల నాన్నగారు కాలేజీకి వెళ్ళారు. అసలు ప్రయివేటు క్లాసే లేదట! దాంతో ఖంగారుపడ్డాం. రాత్రంతా వెతుకుతున్నాం. తెల్లవారేసరికి ఉత్తరం వచ్చింది."

"ఏమని ?"

"కమాల్‌తో కలిసి వెళ్ళిపోతున్నాననీ తన కోసం ఖంగారుపడి వెతక వద్దనీ."

"కమాల్ ఎవరు ?"

"మీ వీధిలోనే ఉంటాడట!"

నాకు చటుక్కున గుర్తొచ్చింది. వసంత కాలేజి ఎకనామిక్స్ లెక్చరర్ కమాల్‌పాషా మా వీధిలోనే ఉంటాడని. ఆ మాటే అడిగాను.

"అతనే - క్లాసులో కూడా వసంత అంటే కాస్త అభిమానం చూపిస్తుండే వాడట. కాలేజీనుండి వచ్చాక మీ ఇంటికని ప్రతిరోజూ బయలుదేరేది. కాని మధ్యలో వాళ్ళింటికి వెళుతుండేదట ఇప్పుడు తెలిసింది.

హటాత్తుగా నా కళ్లముందు తెరలు విడిపోయినట్లయింది. నా పాటని మెచ్చుకుని స్నేహంచేసిన వ్యక్తి నేను

సంగీతం సాధన చేసేటప్పుడు కాకుండా అది పూర్తయ్యాక మాత్రమే ఎందుకు వస్తుందా అని నా మనసులో ప్రశ్న రేగుతుండేది. ఇన్నాళ్ళకి దానికి జవాబు దొరికింది. కాని కాని వసంత ఈ దిగి పోవడానికి నేను ప్రాణాధికంగా ప్రేమించే సంగీతం, నేను తోడ్ప డ్డామా! ఈ చేదు నిజం నా మనసులో ముల్లులా గుచ్చుకుంది. బహుశః జీవి తంలో మాయని గాయంగా మిగిలి పోతుందేమో!

తప్పు చేసినట్లుగా ఆవిడముందు తల ఎత్తలేకపోయాను. అలాగే చాలా సేపు కూర్చుండిపోయాను. చివరకు "బహుశః పెళ్ళిచేసుకుని వస్తారేమో?" అన్నాను.

ఆవిడ నవ్వింది. మనసులోంచి వచ్చిన దుఃఖాన్ని పెదవుల చివర నవ్వుగా మార్చుకున్న నవ్వది.

"అతనికి ఇది వరకే పెళ్ళయింది. ఇద్దరు పిల్లలుకూడా. తను ముస్లింగా మారి అతన్ని పెళ్ళి చేసుకుంటానని, అలాగయితే నేరం కిందకి రాదనీ వ్రాసింది. ఉత్తరం నిండా ఇలాగే పగటి కలలు చాలా ఉన్నాయి, ఇంతకీ ఆ కమల్‌కి కాలేజీలో ఏమంత మంచి పేరు లేదట! ఈ పిచ్చిది పచ్చి నిజాలని చూడకుండా జీవితం మరీ కథలా సుఖాంతం అయిపోతుందని నమ్మి అందరి గుండెల్లోనూ ఇంత ఆరనిచిచ్చు ఎలా పెట్టిందో అర్థం కావడం లేదు."

—ఆవిడ చెప్పడం ఆపేసింది. నేను మౌనంగా వచ్చేస్తుంటే ఏమీ అనలేదు. అలా కూర్చుండి పోయింది.

నేను ఇంటికి వచ్చి తిన్నగా మేడ మీదకు వెళ్ళిపోయాను. అప్పుడే చీకటి పడుతోంది. మనసంతా శూన్యంగా, మబ్బుపట్టినట్టుగా ఉంది. అర్థంకాని ఆవేదన ఏదో గుండెల్ని పిండుతోంది. మూలగా ఉన్న తంబురా నాలుగుతీగెల చేతులతో వికృతంగా నాట్యం చేస్తున్న ట్టుగా ఉంది. జీవితంలో మొదటిసారిగా పాడటం అంటే బాధగా తప్పుచేస్తున్న ట్టుగా అనిపించసాగింది. పుస్తకాలు టేబుల్‌మీద పడేసి కుర్చీలో కూల బడ్డాను. పుస్తకాలు తగిలి టేబుల్ చివరగా ఉన్న ఫోటో ఒకటి క్రింద పడింది. ఒంగి తీసాను. అద్దం పగిలి పోయింది. వెర్రిగా దానివేపేచూసాను. అద్దం ముక్కలు రాలిపోయి ఏ అడ్డూ లేకుండా నా చేతికి తగులుతున్న నా వసంత ఫోటో అది. నా కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. కన్నీ ళ్ళకు అటుప్రక్క ఫోటోలోని వసంత నిర్మలంగా, స్నేహం చిప్పిలంగా నవ్వు తోంది.

*